ఖరీఫ్‌కు రైతాంగం సన్నద్ధం

- దాదాపు పూర్తయిన దుక్కులు
- వరుణుడి కోసం రైతుల ఎదురు చూపులు
- వాణిజ్య పంటలే అధికంగా సాగు
- నందిగామ నియోజకవర్గంలో 34,483 హెక్టార్ల సాగు భూమి


ఏడీఏ ఐ.శ్రీనివాస్

నందిగామ: జూన్ మాసం ప్రవేశించడంతో రైతులు తొలకరి కోసం ఎదురు చూస్తున్నారు. ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే దుక్కులు దున్ని పొలాలను సిద్ధం చేసుకున్నారు. వరుణ కటాక్షం లభించిన వెంటనే అపరాల సాగుకు శ్రీకారం చుట్టేందుకు సిద్ధంగా ఉన్నారు. ఈ సంవత్సరం వర్షాలు అవసరమైన మేర కురుస్తాయంటూ వాతావరణ శాఖాధికారులు చెప్పడంతో చినుకు రాక కోసం ఆశగా నిరీక్షిస్తున్నారు.

నియోజకవర్గంలో ఏటా సాగయ్యే పంటలు..

నందిగామ నియోజకవర్గం మెట్ట ప్రాంతం కావడంతోపాటు నాగార్జున సాగర్ ఎడమ కాల్వకు టెయిల్ ఎండ్‌లో చాలా వరకు సాగు భూమి ఉంది. ఈ నేపథ్యంలో రైతులు వాణిజ్య పంటలు మాత్రమే అధికంగా సాగు చేస్తారు. వాటిలో ప్రధానమైనది పత్తి పంట. వాతావరణ పరిస్థితులు ఎలా ఉన్నా, ఈ పంటను అధిక విస్తీర్ణంలో రైతులు సాగు చేస్తారు. సుబాబుల్ తర్వాత ఈ ప్రాంతంలో అత్యధికంగా పండే పంట ఇదే కావడం గమనార్హం. దీంతోపాటు పలు ఎత్తిపోతల పథకాలు, బోర్లు, చెరువులు, ఉప నదులు, బావుల కింద వరి సాగు జరుగుతుంది. తర్వాతి స్థానం మిర్చి పంటదే. వీటికి తోడు అపరాల పంటలు కూడా సాగు చేస్తున్నారు. సాధారణంగా ప్రతీ ఏటా జూన్ రెండో వారంలో ఖరీఫ్ సాగు ప్రారంభమవుతుంది. అదను కోసం ప్రస్తుతం రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు.

34,483 హెక్టార్ల సాగు భూమి..

నందిగామ నియోజకవర్గంలోని నందిగామ, కంచికచర్ల, చందర్లపాడు, వీరులపాడు మండలాల పరిధిలో మొత్తం 34,483 హెక్టార్ల సాగు భూమి ఉన్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. గత ఏడాది 13,469 హెక్టార్లతో పత్తి, వరి 5,866, మిర్చి 3,585 హెక్టార్ల విస్తీర్ణంలో సాగయ్యాయి. ఇక మిగిలిన హెక్టార్లలో మొక్కజొన్న, పసుపు, కందులు, కాయగూరలు, ఆకుకూరలు సాగు చేశారు. ఈ ఏడాది కూడా ఈ విస్తీర్ణం దాదాపు ఇంతే స్థాయిలో ఉండవచ్చునని అధికారులు పేర్కొంటున్నారు.


పొలంలో దుక్కులు


సాగుకు సిద్ధంగా ఉన్న పొలం

విత్తన ఎంపికలో ఈ జాగ్రత్తలు తప్పనిసరి

విత్తనాల ఎంపికలో తగిన జాగ్రత్తలు పాటించాలని ఏడీఏ ఐ.శ్రీనివాస్ సూచిస్తున్నారు.

- రైతులు విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు తప్పని సరిగా లైసెన్స్ కలిగిన వ్యాపారుల వద్ద మాత్రమే కొనుగోలు చేయాలి.
- గుర్తుతెలియని వ్యక్తులు చెప్పే మాటలు నమ్మవద్దు.
- విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు తప్పని సరిగా బిల్లు తీసుకోవాలి. తీసుకునే బిల్లులో ముఖ్యంగా పంట, విత్తనం పేరు, రకం, లాట్ నెంబర్లు పొందుపరిచి ఉండాలి.
- బిల్లుపై తప్పనిసరిగా విక్రయించిన వ్యాపారి, రైతు సంతకం ఉండాలి.
- విత్తన ప్యాకెట్లపై లేబుల్స్‌ను పరిశీలించాలి. ప్యాకింగ్ తేదీ, గడువు తేదీ, ధర, కాల పరిమితి చూసుకోవాలి.
- బీటీ విత్తనాలయినట్లయితే తప్పని సరిగా లేబుల్‌పై జెనటిక్ ఇంజినీరింగ్ అప్రూవల్ ముద్ర ఉందో లేదో గమనించాలి.
- విత్తనాలు పొలంలో విత్తడానికి ముందే నమూనాగా డిస్పోజబుల్ గ్లాసుల్లో మట్టిని పోసి నమూనాగా విత్తి మొలక శాతాన్ని పరీక్షించుకోవాలి.
- విత్తనాలు కొనుగోలు చేసిన తర్వాత దుకాణ యజమాని ఇచ్చిన బిల్లును తప్పని సరిగా పంట పూర్తయ్యేంత వరకు భద్రపరుచుకోవాలి.
- ఎట్టి పరిస్థితుల్లోనూ ప్యాకెట్లలో కాకుండా విడిగా విక్రయించే విత్తనాలను రైతులు కొనుగోలు చేయరాదు.
- మా కంపెనీలకు చెందిన విత్తనాలు అధిక దిగుబడులు ఇస్తాయని, మాది మంచి కంపెనీ అంటూ ఎవరైన గుర్తు తెలియని వ్యక్తులు చెప్పే మాటలు నమ్మవద్దు.

క్లుప్తంగా

శిలాఫలకాలు ధ్వంసం



అనిగండ్లపాడు(పెనుగంచిప్రోలు): మండలంలోని అనిగండ్లపాడు గ్రామంలో జెడ్పీ హైస్కూల్ వద్ద సీసీ రోడ్డు ప్రారంభానికి సంబంధించి ఏర్పాటు చేసిన శిలాఫలకాలను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసిన ఘటన గురువారం చోటు చేసుకుంది. శిలాఫలకాలను పగుల కొట్టి ముక్కలు ముక్కలు చేశారు. దీనిపై సర్పంచ్ బి.జ్యోతిబ్రహ్మం ఆవేదన వ్యక్తం చేశారు.

నేరస్తుడి నగర బహిష్కరణ పొడిగింపు

విజయవాడస్పోర్ట్స్: విజయవాడ నగరంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తూ సామాన్య ప్రజా జీవనానికి భంగం కలిగిస్తున్న నేరస్తుడు కసిరెడ్డి వెంకట నరసింహారెడ్డి అలియాస్ బారురెడ్డి నగర బహిష్కరణను పొడిగిస్తూ పోలీస్ కమిషనర్ పీహెచ్‌డీ రామకృష్ణ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. నిందితుడు బారురెడ్డి గతంలో అనేక నేరాలకు పాల్పడి జైలు జీవితం అనుభవించాడని, జైలు నుంచి విడుదలైన తరువాత అతని ప్రవర్తనలో ఎలాంటి మార్పు రాకపోవడంతో గతంలోనే నగరం నుంచి బహిష్కరించామని పేర్కొన్నారు. అయినప్పటికీ అతని ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో బహిష్కరణను మరో ఆరు నెలలు పొడిగించినట్లు స్పష్టం చేశారు.

బడిఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి



తిరువూరు: మండలంలోని చిట్టేలలో గురువారం ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఎంపీయూపీ స్కూల్ ఉపాధ్యాయులు గ్రామంలో పర్యటించి బడి ఈడు పిల్లలను గుర్తించారు. పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడారు. విద్య ప్రాధాన్యతను వారికి వివరించారు. పాఠశాలకు వెళ్లే విద్యార్థులను పనులకు పంపవద్దని, విద్యా హక్కు చట్టం ప్రకారం పిల్లలను ఇతర పనులకు పంపడం నేరమని చెప్పారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు.

ఘనంగా రామాలయ వార్షికోత్సవం



తిరువూరు: తిరువూరు శివారు పీటీకొత్తూరులోని సీతారామచంద్రస్వామి ఆలయ 13వ వార్షికోత్సవం గురువారం ఘనంగా జరిగింది. తెల్లవారుజామున పంచామృత అభిషేకం, ప్రత్యేక పూజలు, సంకీర్తన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ అంబటి వెంకటనారాయణరెడ్డి, ఆలయ అర్చకుడు ఈశ్వరప్రగడ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నీట్‌లో ప్రతిభ చూపిన కేబీఎన్ షైన్ విద్యార్థులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కాకరపర్తి భావనారాయణ కళాశాల షైన్ విభాగం విద్యార్థులు ఇటీవల ప్రకటించిన నీట్ పరీక్షలో అద్భుతమైన ప్రతిభను చూపారని ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు తెలిపారు. నీట్ ఫలితాల్లో తమ విద్యార్థులు ఐదుగురు మెడికల్ సీట్లు సాధించే ర్యాంకులను పొందారని చెప్పారు. 97.6 శాతంతో శివాన్ష్‌షా ఎంబీబీఎస్ సీటుకు, 493 మార్కులతో జి.భారతి, 440 మార్కులతో ఇ.వెంకటేశ్వరరావు బీడీఎస్ సీట్లను సాధించే అవకాశముందని తెలిపారు. షేక్ ఆస్మా, ఎం.సాయిస్రవంతి బీఏఎంఎస్‌లు సీట్లు సాధించే అవకాశముందని అన్నారు. చాలా తక్కువ మంది విద్యార్థులతో తమ కళాశాల అద్భుతమైన మార్కులను సాధించినట్టు తెలిపారు. మంచి మార్కులు సాధించిన విద్యార్థులను కళాశాల కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాసు అభినందించారు. కార్యక్రమంలో టి.నరేంద్రకుమార్, మోహన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాసు

రామలింగేశ్వరస్వామి ఆలయంలో చండీ హోమం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): వైశాఖ అమావాస్యను పురస్కరించుకుని భీమనవారిపేటలోని శ్రీ విజయదుర్గా రామలింగేశ్వర స్వామివారి ఆలయంలో గురువారం రుద్రాభిషేకం, చండీహోమాలను నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో ఆలయ అర్చకులు చింతలపాటి సుబ్రహ్మణ్యశాస్త్రి, పవన్‌శర్మ పర్యవేక్షణలో అర్చకులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. తొలుత అర్ధనారీశ్వరుడైన రామలింగేశ్వర స్వామివారికి పంచామృత అభిషేకాలు, విశేష అలంకరణ జరిగాయి. యాగశాలలో మహాన్యాస పూర్వకంగా ఏకాదశ రుద్రాభిషేకం, చండీహోమాలను జరిపించారు. మధ్యాహ్నం దేవస్థాన ప్రాంగణంలో అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమాల్లో పలువురు భక్తులు పాల్గొన్నారు.


పూర్ణాహుతి కార్యక్రమంలో ఆలయ అర్చకులు

విద్యార్థులకు అప్రెంటీస్‌షిప్‌నకు అనుమతి

మైలవరం: మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల తృతీయ సంవత్సరం బీబీఏ లాజిస్టిక్స్ విద్యార్థులకు హైదరాబాద్ జీలాగ్ లాజిస్టిక్స్ కంపెనీ, చెన్నైలోని లాజిస్టిక్స్ స్కిల్ కౌన్సిల్‌లో ఒక సంవత్సరం పాటు అప్రెంటీస్‌షిప్ చేయడానికి అనుమతి లభించిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి తెలిపారు. మైలవరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆయన మీడియాతో మాట్లాడారు. తమ కళాశాలలో కంపెనీల యాజమాన్యంతో గురువారం జరిగిన అవగాహనా సదస్సులో తమ కళాశాల విద్యార్థులకు లాజిస్టిక్స్ కంపెనీలో ఎలా పనిచేయాలి అనే అంశంపై శిక్షణ ఇచ్చారన్నారు. ఐదుగురు విద్యార్థులకు డీహెచ్ఎల్ కంపెనీలో, ఆరుగురు విద్యార్థులకు హైదరాబాద్ ఫ్లిప్‌కార్ట్ కంపెనీలో అప్రెంటిస్‌షిప్ ఏర్పాటు చేశామన్నారు. వీరు అన్ని సదుపాయాలతో కలిపి ప్రతి నెలా రూ. 15 వేల వేతనం పొందుతారని చెప్పారు. లాజిస్టిక్ కంపెనీ ఎన్టీఆర్ జిల్లా ప్రతినిధి సుధా మాట్లాడుతూ బీబీఏ లాజిస్టిక్స్ చదివే విద్యార్థులు మూడో ఏడాది నుంచి చదువుతోపాటు కంపెనీలో పని చేయవచ్చన్నారు. కార్యక్రమంలో కామర్స్ విభాగాధిపతి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

కంచికచర్ల: రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహిస్తోందని ప్రతి ఒక్కరూ వాటిని సద్వినియోగం చేసుకోవాలని కంచికచర్ల గ్రంథాలయాధికారి అల్లూరు రామచంద్రుడు పేర్కొన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో గురువారం వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 40 రోజుల నుంచి ఈ శిబిరాలను చిన్నారుల మెదడుకు పదును పెట్టేందుకు రాష్ట్ర పౌరశాఖ ఆధ్వర్యంలో ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని అన్నారు. విద్యార్థులకు విజ్ఞానం, వినోదం, పుస్తక పఠనం, యోగా, నృత్య ప్రదర్శన, చిత్రలేఖనం, జాతీయ నాయకుల పేర్లను తెలుసుకోవడం వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. దీంతో వారి తల్లిదండ్రులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో విశ్రాంత గ్రంథాలయాధికారి రంగిశెట్టి వెంకటేశ్వర్లు, కవి రచయిత నీలం సర్వేశ్వరరావు, యోగా గురువు ఎం.మల్లికార్జునరావు, ఐఈఆర్టీ ఉపాధ్యాయుడు ఎం.కనకారావు, డాన్స్ మాస్టర్ బిట్ర రాహుల్‌కుమార్, మేదూరు మాణిక్యాలరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని జిల్లా గ్రేడ్-1 స్థాయి గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయాధికారి ఆలేటి ప్రభ పేర్కొన్నారు. ఈ సమ్మర్ క్యాంపులో పలువురు ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థులకు పలు అంశాల గురించి బోధిస్తూ వాటికి సంబంధించిన విజ్ఞానం పట్ల అవగాహన కల్పిస్తున్నారు. ఈ సందర్భంగా గురువారం విద్యార్థులతో పుస్తక పఠనం, పొడుపు కథలు చెప్పించడం, కథల పోటీలు, నృత్య శిక్షణ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు దోసపాటి నాగేశ్వరరావు, వినోద్‌బాబు, అల్లి చంద్రశేఖర్, గ్రంథాలయ సిబ్బంది సత్యవతి, శ్యామల, రమేష్ తదితరులు పాల్గొన్నారు.


పేట గ్రంథాలయంలో కథల పోటీలో చిన్నారి


కంచికచర్లలోని గ్రంథాలయంలో చదరంగం ఆడుతున్న విద్యార్థులు

నర్సరీల నిర్వాహకులు నిబంధనలు పాటించాలి

నందిగామ: మిరప నారు పెంచే నర్సరీల నిర్వాహకులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని ఉద్యాన శాఖాధికారిణి నీలిమ సూచించారు. మండలంలోని అడవిరావులపాడు ప్రాంతంలో ఏర్పాటు చేసిన షెడ్ నెట్ నర్సరీలను గురువారం ఆమె పరిశీలించి నిర్వాహకులకు తగిన సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఉద్యాన శాఖాధికారిణి నీలిమ మాట్లాడుతూ షెడ్‌నెట్టు నర్సరీ నిర్వాహకులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని లేదంటే చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా పెంచేనారుకు సంబంధించిన విత్తనాల బిల్లులతోపాటు నర్సరీకి సంబంధించిన పూర్తి వివరాలు అందుబాటులో ఉంచాలన్నారు. షెడ్ నెట్ నర్సరీల బెడ్ల పక్కన నీలి, పసుపు రంగు జిగురు పూసిన అట్టలు ఏర్పాటు చేసుకోవాలని, అక్కడక్కడ బంతి మొక్కలు నాటుకోవాలని సూచించారు.


అడవిరావులపాడులో నర్సరీని పరిశీలిస్తున్న ఉద్యాన శాఖాధికారిణి నీలిమ

వైఎస్సార్ సీపీ కార్యకర్త గుండెపోటుతో మృతి

బలుసుపాడు(జగ్గయ్యపేట అర్బన్): గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ కార్యకర్త కంబాల వెంకటరత్నం(63) గురువారం సాయంత్రం గుండెపోటుతో మృతి చెందాడు. మృతుని కుటుంబ సభ్యులు ఇచ్చిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కంబాల వెంకటరత్నం వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు. ఈయన కుమారుడు కంబాల మల్లయ్య వైఎస్సార్ సీపీ పేట మండల ఎస్సీ విభాగం అధ్యక్షుడుగా పనిచేస్తున్నాడు. కాగా ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఓడిపోవడంతో తట్టుకోలేకపోయాడు. దీంతో వెంకటరత్నం తీవ్ర మనస్థాపానికి గురై గుండెపోటుతో ఇంటి వద్దనే మృతిచెందాడు. గ్రామ సర్పంచ్ యడ్లపల్లి సూర్యప్రకాష్, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు ఆతుకూరి గోపాలరావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు వెంకటరత్నం భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.


మృతుడు కంబాల వెంకటరత్నం (ఫైల్)

ఉదయభాను పరామర్శ..

వైఎస్సార్ సీపీ సీనియర్ కార్యకర్త కంబాల వెంకటరత్నం గుండెపోటుతో మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను ఫోన్ ద్వారా మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి కుటుంబానికి వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

● బొమ్మలండీ.. బొమ్మలు


కృష్ణలంక సమీపంలో విక్రయిస్తున్న బొమ్మలు



బొమ్మలండీ...బొమ్మలు...అందమైన బొమ్మలు...భలే భలే బొమ్మలు.. మన ఇంట్లో పసిపాపల్లాంటి బొమ్మలు... జీవం ఉట్టిపడే బొమ్మలు... గడప దాటి బయటకు వచ్చేవరకు పిల్లలకు ప్రియనేస్తాలు ఈ బొమ్మలే... నగరంలో కృష్ణలంక సమీపంలో అందమైన బార్బీ డాల్స్ బొమ్మలు విక్రయిస్తున్నారు. ఇవి చూపరులకు కనువిందు చేస్తున్నాయి.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

మిద్దె పంటలతో మంచి ఆరోగ్యం

ప్రస్తుతం మనం తినే కూరగాయలు కాని, పండ్లు కాని ఏవి తినాలన్నా భయపడే రోజులివి. ఏ పంటలో చూసినా రైతులు చీడపీడల నివారణ కోసమో, అధిక దిగుబడి కోసమో రసాయనాలు విపరీతంగా వాడేస్తున్నారు. దాంతో రైతులు పండించిన పండించిన కూరగాయలు, పండ్లు అన్నీ రసాయన కాలుష్యంతో నిండి ఉంటున్నాయి. గత్యంతరం లేని పరిస్థితుల్లో మనం అవి తిని లేనిపోని అనారోగ్యాలు తెచ్చుకుంటున్నాము. ఈ నేపథ్యంలో ఆర్గానిక్ పంటలపై ఇప్పుడిప్పుడే ప్రజల్లో చైతన్యం పెరుగుతోంది. నగరంలోని భారతీ నగర్‌లో ఓ ఇంట్లో మేడపైనే కూరగాయలు, పండ్లు పండిస్తూ వారు స్వచ్ఛమైన ఆహారం తీసుకుంటూ ఇంటిల్లిపాదీ ఆరోగ్యంగా ఉంటున్నారు. చుట్టుపక్కల వారందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు.


జామచెట్టుకు కాసిన కాయలు


మేడపైన ఏర్పాటు చేసిన కుండీలు

- మేడపైన కూరగాయల పెంపకం
- వివిధ రకాల పండ్ల మొక్కల పెంపకం
- ఏడాది పొడవునా కుటుంబానికి సరిపోతున్న వైనం

ఆటోనగర్(విజయవాడతూర్పు): విజయవాడలోని భారతీనగర్‌లో ఓ ఇంటి మేడపైనే గత కొద్ది సంవత్సరాల నుంచి కూరగాయలు, వివిధ రకాల పండ్లను పండిస్తున్నారు. ఇంటికి సరిపడా కావలసిన దాని కంటే అధికంగా దిగుబడి సాధిస్తున్నారు. ఇంటిల్లిపాదీ స్వచ్ఛమైన పంటలను తింటూ ఆరోగ్యంగా ఉంటున్నారు.

ఇతరులకు కూడా కొంతమేరకు సేంద్రియ పంటలను అందిస్తున్నారు. భారతీనగర్‌కు చెందిన మైనేని సాయిబాబు దంపతులు తమ ఇంటి పైన ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పెద్ద పెద్ద కుండీలలో 10 రకాలకు పైగా కూరగాయల మొక్కలు, ఆకు కూరల మొక్కలను వేశారు. ఇందులో భాగంగా వంగ, టమోట, గోంగూర, చుక్కకూర, బీరకాయ, సొర కాయలను పందిరిగా వేసి పండిస్తున్నారు. అంతే కాకుండా సపోట, జామకాయ, దానిమ్మ, అరటి మొక్కలను కూడా వేశారు. ఇవన్నీ విరగకాస్తున్నాయి.

బయట కూరగాయలు, పండ్లు కొనుగోలు చేయాల్సిన అవసరం లేకుండా మేడపైన పండుతున్న కూరగాయలు, పండ్లే తమకు సరిపోతున్నాయని సాయిబాబు చెబుతున్నారు.


విరగకాసిన సపోట కాయలు

కుండీల్లో ఎర్రమట్టి...

కూరగాయలు, పండ్ల మొక్కలను వేసేందుకు గాను సుమారు 50 కిలోమీటర్ల దూరం నుంచి ఎర్రమట్టిని తీసుకు వచ్చి వీటిని నాటినట్టు చెప్పారు. దీని ఆలనా పాలనా చూడటానికి ఇద్దరు కూలీలను పెట్టారు. వీటికి నీరు పెట్టడానికి ప్రత్యేకంగా పైపులను ఏర్పాటు చేశారు. దీనిపై వారు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ప్రస్తుతం జామ, సపోట, దానిమ్మ చెట్లు విరగకాస్తున్నాయి.

ఆరోగ్యకరంగా ఉంటున్నాం

ప్రస్తుతం బయట దొరికే కూరగాయలు, పండ్లు అధికంగా రసాయన ఎరువులతో పండిస్తున్నారు. వీటి ద్వారా అనారోగ్య పరిస్థితులు ఎదుర్కోవలసి వస్తోంది. ఈ ఉద్దేశంతో తాము గత కొద్ది సంవత్సరాల నుంచి మేడ పైన ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన కుండీల్లో కూరగాయలు, పండ్లు పండిస్తున్నాం. ఇంట్లోనే సేంద్రియ ఎరువులతో వీటిని పండిస్తున్నాం. ఆరోగ్యకరమైన కూరగాయలు, పండ్లు తినగలుగుతున్నాం. ఇంట్లో వాళ్లమంతా ఆరోగ్యంగా ఉంటున్నాం.

– మైనేని సాయిబాబు, ఇంటి యజమాని

రేపటి నుంచి ఉచిత యోగా శిక్షణ

ఇబ్రహీంపట్నం: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 8 నుంచి 22వ తేదీ వరకు ఉచిత యోగా శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు శాంతివన్ యోగా ఫౌండేషన్ అధ్యక్షుడు లంకే జనార్దన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎ.కాలనీ ఎస్‌వీసీటీ కల్యాణ మండపంలో శ్రీ వెంకటేశ్వర చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో యోగా శిక్షణ తరగతులు ప్రతి రోజు ఉదయం, సాయంత్రం ఆరు నుంచి 7.15 గంటల వరకు జరుగుతాయన్నారు. దేహశుద్ధికి షట్‌క్రియలపై అవగాహన, సూక్ష్మ వ్యాయామాలు, ఆసనాలు, సూర్య నమస్కారాలు, ప్రాణాయామం, ముద్రలు, వివిధ ధ్యాన పద్ధతులలో శిక్షణ ఇస్తారని చెప్పారు. పరిసర ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు సెల్: 63014 54859 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఎన్ఎంఎంఎస్‌కు విద్యార్థినుల ఎంపిక

ఆగిరిపల్లి: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లో 8వ తరగతి చదివిన నలుగురు విద్యార్థినులు నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ (ఎన్ఎంఎంఎస్) స్కాలర్ షిప్‌నకు ఎంపికయ్యారని హెచ్ఎం పుష్పలత తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అందించే ఈ స్కాలర్ షిప్‌కు రాత పరీక్ష ద్వారా 8వ తరగతి చదువుతున్న గంటా యామిని, కొండా భవ్యశ్రీ, సురోజు ప్రణవి, నత్తా షైనీప్రియ ఎంపికయ్యారని చెప్పారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నందిగామ డివిజన్
79950 92114 (నందిగామ)
99122 20547 (జగ్గయ్యపేట)
Office mail : sakshiads@gmail.com